## నేడు వైఎస్సార్ విగ్రహావిష్కరణ

**సుభాష్‌నగర్:** దివంగత నేత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి 16వ వర్ధంతిని పురస్కరించుకుని గాజులరామారం డివిజన్ మహాదేవపురం చౌరస్తాలో ఈనెల 2న (నేడు) విగ్రహావిష్కరణ చేయనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు సాతల గోపాల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి పార్టీలకతీతంగా నాయకులు కార్యకర్తలు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

## మహాదేవపురంలో ఉబికి వస్తున్న నీరు



**సుభాష్‌నగర్:** ఇటీవల వర్షాలు సంమృద్ధిగా కురవడంతో భూగర్భ జలాలు పెరిగాయి. గాజులరామారం డివిజన్ మహాదేవపురంలో ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం కోసం గోతులు తవ్వగా 3 ఫీట్ల నుంచే నీరు ఉబికి వస్తోంది. దీంతో సదరూ ఇంటి యజమాని మోటార్ సాయంతో నీళ్లను తోడేస్తుండగా 'సాక్షి' కెమెరాకు చిక్కింది.

## డివిజన్ అభివృద్ధికి కృషి

**జగద్గిరిగుట్ట :** డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నానని కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. రూ. 65 లక్షల వ్యయంతో భూదేవి హిల్స్‌లో నిర్మించిన సీసీ రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో పెండింగ్ పనులు కూడా వీలైనంత త్వరగా పూర్తయ్యేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో పొట్లూరి బాలకృష్ణ, గణేశ్, మల్లేశ్ గౌడ్, విట్టల్ ముదిరాజ్, మల్లాచారి, కేవీ రాజు, మంజుల, సోమయ్య, సాయిలు, హనుమంతు, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

## కరాటేలో పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులు

**నిజాంపేట్:** బెంగళూరులో జరిగిన 4వ సౌత్ జోనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో ప్రగతినగర్‌కు చెందిన ట్రైన్ యువర్‌సెల్ఫ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు తెలంగాణకు ప్రాతినిధ్యం వహించారు. మొత్తం 24 మంది పాల్గొనగా 8 బంగారు, 4 వెండి, 6 కాంస్యం పతకాలను కైవసం చేసుకున్నారు. నిత్యసాయి నిశిత నల్లా, దివ్యాంశిత ఎట్టే, హరిణి మద్ది, లక్ష్మీ రోహిత గొంతులు బంగారు పతకాలు సాధించగా, మైత్రి కొండవీటి, గుజ్జుల కీర్తి శ్రీ రెడ్డి వెండి, ప్రవస్తి గుబ్బా, వి.శ్రీలిఖిత కాంస్యం పతకాలు సాధించారు.

## విద్యుదాఘాతంతో కూలీ మృతి



**దుండిగల్:** విద్యుదాఘాతంతో కూలి మృతి చెందిన ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసు కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా మల్యాల గ్రామానికి చెందిన గోపి (34) నాలుగేళ్ల క్రితం నగరానికి వలస వచ్చి నాగోల్‌లో నివాసముంటున్నాడు. దుండిగల్ మున్సిపాలిటీలోని ఓ కాంట్రాక్టర్ వద్ద పని చేసేందుకు గండి మైసమ్మకు వచ్చాడు. కూలీ మాట్లాడుకుని గోపితో పాటు స్వామి అనే వ్యక్తి సారెగూడెం సమీపంలోని ఉజ్వల బార్ వద్ద సోమవారం ఉదయం గొయ్యిను తవ్వుతుండగా గడ్డపారకు కరెంట్ కేబుల్ వైర్లు తగిలి విద్యుత్ షాక్‌కు గురై గోపి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న దుండిగల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా గొయ్యిని తవ్వేందుకు కాంట్రాక్టర్ తమ అనుమతి తీసుకోలేదని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

## వ్యక్తి అదృశ్యం



హరీశ్

**ఘట్‌కేసర్:** ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన గాజపాక హరీశ్ (32) ఆగస్టు 30న బయటకు వెళ్తొస్తానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతడి భార్య సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాణిక్యనగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..



చిత్తారమ్మదేవినగర్‌లో పూజల్లో మహిళలు..



నిజాంపేట్‌లో పూజల్లో ఎంపీ ఈటల రాజేందర్..



విజయ్‌నగర్‌కాలనీలో అన్నదానం..



జీడిమెట్ల డివిజన్‌లో అన్నదానం..



ప్రగతినగర్‌లో లడ్డూను కైవసం చేసుకున్న భక్తుడు



కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో..



సుచిత్రలోని ప్రగతి ప్రైడ్ అపార్ట్‌మెంట్స్‌లో..



# గణనాథుడికి ఘనంగా పూజలు



గాజులరామారం పోచమ్మబస్తీలో..

నియోజకవర్గంలో వినాయక నవరాత్రోత్సవాలు అంగరంగా వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ప్రత్యేక పూజలు.. అన్నదానాలు నిర్వహించారు. అలాగే స్వామివారి లడ్డూలకు వేలం నిర్వహించగా సొంతం చేసుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. బాచుపల్లిలో గుర్రం బ్రదర్స్ రూ.1.75 లక్షలకు, భౌరంపేట్ ప్రణీత్ బ్లూమ్స్‌లో రూ. 3 లక్షలకు మధుసూదన్‌రెడ్డి లడ్డూలను దక్కించుకున్నారు. పలుచోట్ల సాయంత్రం మేళాతాళాల మధ్య నత్యాలు చేస్తూ గణనాథులను నిమజ్జనాలకు తీసుకువెళ్లారు.

–కుత్బుల్లాపూర్



కొంపల్లి జయబేరి పార్కులోని సైరా హైట్స్‌లో..



కృషి కాలనీలో అన్నదానం..

# బీఆర్‌ఎస్ శ్రేణుల నిరసన



షాపూర్‌నగర్ చౌరస్తాలో నిరసనలో బీఆర్‌ఎస్ శ్రేణులు

**కుత్బుల్లాపూర్:** కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో పీసీ ఘోష్ ఇచ్చిన నివేదిక ఆధారంగా దర్యాప్తును సీబీఐకు అప్పగించడంపై బీఆర్‌ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. షాపూర్‌నగర్ ఉషోదయ టవర్స్ వద్ద సోమవారం నిర్వహించిన ధర్నాలో శ్రేణులు సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 125 ఏళ్ల చరిత్ర గల కాంగ్రెస్ హయాంలో పూర్తికాని ప్రాజెక్టులతో తెలంగాణ రైతాంగం అవస్థలు పడుతుంటే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్లలోనే కేసీఆర్ కాళేశ్వరం లాంటి భారీ ప్రాజెక్టు నిర్మించారన్నారు. ఆయన ప్రతిష్టను దెబ్బతీసేందుకు రాష్ట్రంలోని కాంగ్రెస్, అటు కేంద్రంలోని బీజేపీ నాటకాలాడుతున్నాయి. రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, వీరికి త్వరలోనే బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కుంట సిద్ధి రాములు, నరేంద్రరెడ్డి, ఎల్లాగైడ్, బలరామ్, శ్రేణులు పాల్గొన్నారు.

# చెరువుల వద్ద ఏర్పాట్లు చేయాలని వినతి

**దుండిగల్:** రానున్న బతుకుమ్మ పండుగను పురస్కరించుకుని చెరువుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు, దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేశ్ కోరారు. ఈ మేరకు గండిమైసమ్మలోని దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్‌ను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుండిగల్‌లోని చిన్న దామర చెరువు కట్టపై ఇటీవల హెచ్ఎండీఏ అధికారులు నిర్మించిన రోడ్డు కారణంగా బతుకమ్మ మెట్లు పూర్తిగా మునిగిపోయాయని, మహిళల సౌకర్యం కోసం తిరిగి నిర్మించాలన్నారు. అదేవిధంగా సింగపురం మైసమ్మ తల్లి ఆలయానికి వెళ్లే మార్గంలో ప్రస్తుత కల్వర్టుకు బదులుగా శాశ్వతంగా సీసీ కల్వర్టును నిర్మించాలని వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆకుల ప్రేమ్ పటేల్, దొంతి మహేశ్ ముదిరాజ్, ఉదయ్ గౌడ్, జక్కుల గోపాల్ యాదవ్, పండుగ శ్రీశైలం ముదిరాజ్, వాపుల శ్రీనివాస్, సిరగల బాబు, శివ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్‌కు వినతి పత్రం ఇస్తున్న గణేశ్

# పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

**కలెక్టరేట్ ఎదుట మేడ్చల్ జిల్లా టీజేఏసీ ఆందోళన**



**సాక్షి,మేడ్చల్ జిల్లా:** సీపీఎస్, యూపీఎస్‌లను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఏపీఎస్) అమలు చేయాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా టీజేఏసీ చైర్మన్ రవిప్రకాష్ డిమాండ్ చేశారు. సోమవారం దేశ వ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట ''పెన్షన్ విద్రోహ దినం'' పేరుతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు అందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం (సీపీఎస్ ), కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్)ను వ్యతిరేకిస్తూ.. పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) మాత్రమే అమలు చేయాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా టీజేఏసీ అధ్వర్యంలో ఉద్యోగులు ధర్నా చేశారు. టీజేఏసీ జిల్లా చైర్మన్, సెక్రటరీ రవిప్రకాష్, వినోద్‌కుమార్‌లు మాట్లాడుతూ.. ఉద్యోగుల కష్టార్జితమైన భవిష్యత్తు భద్రతను బలిపెట్టే వంటి విధానాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాము అంగీకరించేదిలేదని హెచ్చరించారు. 2004కి ముందు ఉద్యోగులకు వర్తించిన పాత పెన్షన్ విధానమే ఉద్యోగుల నిజమైన హక్కు అని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. టీజేఏసీ నాయకులు రామ్మోహన్, కురుమూర్తి, సుధాకర్, రవీందర్, వేంకటేశ్వర్లు,ప్రేమ్‌కుమార్, జయసింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేందర్, భరత్‌కుమార్, శేషసాయి, గిరికాంత్, అశ్విని, సుధీర్, కలెక్టరేట్ యూనిట్ నాయకులు పాల్గొన్నారు.

### అనుమానం..
# పెనుభూతమై..
**భార్యపై కత్తితో దాడి.. ఆపై తానూ ఆత్మహత్యాయత్నం**

**జగద్గిరిగుట్ట:** భార్యపై అనుమానంతో కత్తితో దాడి చేసి తానూ ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరసింహ తెలిపిన ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన శ్రీధర్ (34), కల్యాణి పదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఎల్లమ్మబండలో నివాసముంటున్న వీరికి ముగురు పిల్లలు. శ్రీధర్ సెల్ టవర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు.అయితే కొంతకాలంగా కల్యాణి సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటోంది. ఇన్‌స్టాగాంలో రవి వ్యక్తితో ఉండడంపై దంపతుల మధ్య వివాదం కొనసాగుతోంది. ఇటీవల ఇన్‌స్టాగాంలో పరిచయమైన రవితో కల్యాణి చాటింగ్ చేస్తున్నదని తెలుసుకున్న శ్రీధర్ గొడవకు దిగగా విడాకుల వరకు వెళ్లింది. కాగా సోమవారం ఈ విషయమై మళ్లీ గొడవ పడగా శ్రీధర్ తన భార్యపై కేబుల్ కట్ చేసే కత్తితో దాడి చేసి తర్వాత తాను కూడా బ్రతకనంటూ చేతిపై అదే కత్తితో కోసుకున్నాడు. కల్యాణి అరుస్తూ బయటకు రావడంతో గమనించిన స్థానికులు ఇద్దరిని చికిత్స కోసం రాందేవ్ ఆసుపత్రికి తరనించారు. ఇద్దరికీ ఎలాంటి అపాయం లేదని డాక్టర్లు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శాశ్వత పరిష్కారం చూపరూ..!



బ్యాంక్‌కాలనీకి వెళ్లే మెడికల్ షాపు వద్ద మరమ్మతులు చేస్తున్న దృశ్యం

**కుత్బుల్లాపూర్:** జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డ నుంచి బ్యాంక్‌కాలనీకి వెళ్లే మూలమలుపు మెడికల్ షాపు వద్ద డ్రైనేజీ నిత్యం పొంగి పొర్లుతోంది. సంబంధిత శాఖ అధికారులు 3 నెలల వ్యవధిలో 10 సార్లు మరమ్మతులు చేపట్టారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదు. దీంతో వర్షం పడిన ప్రతిసారి ఇక్కడ డ్రైనేజీ పొంగడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## తాగునీరు రోడ్డు పాలు..!



కుత్బుల్లాపూర్ ప్రధాన రోడ్డులో పారుతున్న తాగునీరు

**రంగారెడ్డినగర్:** అధికారుల నిర్లక్ష్యం.. వెరసి తాగునీరు రోడ్డుపై ఏరులై పారుతోంది. కుత్బుల్లాపూర్ గ్రామంలోని ఎమ్మెల్యే పాత ఇంటి సమీపంలో 20 రోజుల క్రితం గోదావరి జలాల పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి తాగు నీరు రోడ్డుపైనే వరదలా పారుతోంది. ఈ విషయమై స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీకి అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

# ప్రజావాణిలో 8 ఫిర్యాదులు

**కుత్బుల్లాపూర్:** జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 8 ఫిర్యాదులు వచ్చాయి. కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహ అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో 4 ఫిర్యాదులు రాగా టౌన్ ప్లానింగ్ 2, ఇంజినీరింగ్, ట్యాక్స్ సెక్షన్‌కు సంబంధించి ఒక్కొక్క ఫిర్యాదులు వచ్చాయి. అదేవిధంగా గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో టౌన్‌ప్లానింగ్ విభాగంపై 3, ఇంజినీరింగ్ 1 ఫిర్యాదు రాగా సంబంధిత శాఖ అధికారులకు పంపినట్లు వారు తెలిపారు.

**నూతన పైపులైన్లు వేయాలని వినతి**

**చింతల్:** సూరారం డివిజన్‌లో అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని కోరుతూ కుత్బుల్లాపూర్ మండల సీపీఎం కార్యదర్శి లక్ష్మణ్ ఆధ్వర్యంలో సోమవారం కుత్బుల్లాపూర్ జలమండలి కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో జీఎం మాధవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. షాపూర్‌నగర్, సంజయ్‌గాంధీనగర్, న్యూ షాపూర్‌నగర్, కళావతినగర్ వివిధ బస్తీల్లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తంగా మారడంతో రోడ్లపైకి మురుగు ప్రవహిస్తోందన్నారు. పెరిగిన గృహాలకు అనుగుణంగా పైపులైన్లు లేవని, కొత్తవి వేయాలని వినతిలో కోరారు. దీనిపై జీఎం మాధవి స్పందించి అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని, అనుమతులు రాగానే పనులు చేపడతామని హామీనిచ్చారని వారు తెలిపారు. నాయకులు మధు, సత్యనారాయణ, నాగరాజు, సాయికుమార్ తదితరులు ఉన్నారు.

# 'జెడ్‌ఎఫ్ నెక్స్‌జన్ నెక్సస్ రెండో ఎడిషన్' షురూ

**నిజాంపేట్:** వీఎన్‌ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో జర్మనీకి చెందిన టెక్నాలజీ సంస్థ జెడ్‌ఎఫ్ నెక్స్‌జన్ నెక్సస్ 2025 రెండో ఎడిషన్‌ను సోమవారం ప్రారంభించారు. జెడ్‌ఎఫ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫిలిప్ గాస్నియర్, వీఎన్‌ఆర్ వీజేఐఈటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.డి.నాయుడు నాయకత్వం వహించారు. అదేవిధంగా జెడ్‌ఎఫ్ వైస్ ప్రెసిడెంట్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ హోల్గర్ క్రాఫ్ట్, జెడ్‌ఎఫ్ వైస్ ప్రెసిడెంట్ అండ్ హెడ్ టెక్ సెంటర్ ఇండియా కృష్ణస్వామి జంబునాథన్, జెడ్‌ఎఫ్ ఇండియా ఇంజినీరింగ్ డైరెక్టర్ అశోక్ కుమార్ ఝాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువ ఇంజినీర్లను అత్యాధునిక ఆటోమోటివ్ టెక్నాలజీల అనుభవం ద్వారా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

## ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం..!

**జగద్గిరిగుట్ట:** డివిజన్ పరిధిలోని సోమయ్యనగర్ ప్రధాన రహదారిలో ఉన్న ఓ విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. 2 నెలల క్రితం ఇక్కడ రోడ్డు విస్తరణలో భాగంగా స్తంభం కింది భాగం వరకు చదును చేసి రోడ్డు వేశారు. ఆ తర్వాత దీని మరమ్మతులు మాత్రం మరిచారు. స్తంభం పైన విద్యుత్ వైర్లు, కేబుల్ వైర్లు ఉండడంతో పాదాచారులు భయాందోళనకు గురవుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయని అధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



# ఎదురు చూపులకు తెరపడేనా..?

**గ్రేటర్‌తో సహా శివారుల్లో జీఓ. 58,59,118 కింద వచ్చిన దరఖాస్తులు 1.19 లక్షలు**

- ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటేనే భూ క్రమబద్ధీకరణకు మోక్షం
- ఆదేశాల కోసం ఎదురు చూస్తున్న రెవెన్యూశాఖ అధికారులు

**సాక్షి, మేడ్చల్ జిల్లా:** గ్రేటర్‌తో సహా శివారులో ప్రభుత్వ భూముల్లో ఏళ్లుగా నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం గడుపుతున్న నిరుపేదలు 20 నెలలుగా భూ క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్నారు. రెండోవిడత భూ క్రమబద్ధీకరణలో భాగంగా ప్రభుత్వం ఆక్రమిత నివాస స్థలాల్లో నివాసం ఉంటున్న పేద ప్రజల నుంచి జీఓ 58,59 కింద అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించి, వాటి పరిశీలన కార్యక్రమాన్ని కూడా అప్పట్లోనే పూర్తి చేసింది. అర్హులను గుర్తించి జీఓ 58,59 కింద భూ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాల్సి ఉండగా.. జనరల్ అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో వాయిదా పడింది. జీఓ 118 కింద స్వీకరించిన దరఖాస్తుల పురోగతి కూడా నిలిచిపోయింది.

**ప్రభుత్వం ఏర్పడి దాదాపు 19 నెలలు..**

- కొత్త ప్రభుత్వం ఏర్పడి 19 నెలలు కావస్తున్నా.. దరఖాస్తులకు మోక్షం లభించడం లేదు. పేద ప్రజలకు మాత్రం ఎదురుచూపులు తప్పడం లేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో భాగంగా ఆరు గ్యారంటీలు, భూభారతి వంటి అంశాలతో పాటు రెవెన్యూ శాఖపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం జీఓ 58,59 దరఖాస్తుల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేస్తోందని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- రెవెన్యూ శాఖ అధికారులు కూడా జీవో 58,59 పై ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నారు. త్వరలో జీఓ 58,59 కింద భూ క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోగలదన్న ఆశాభావాన్ని గ్రేటర్‌తో సహా శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలలోని దరఖాస్తుదారులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.




- నగర శివారులోని 44 కాలనీల్లో నివాస స్థలాల్లో భూ క్రమబద్ధీకరణకు సంబంధించిన అప్పటి ప్రభుత్వం జారీ చేసిన జీఓ 118 పై కూడా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని స్థానికులు ఆశిస్తున్నారు. వీటికి సంబంధించిన గ్రేటర్‌తో సహా శివారుల్లో సుమారు 1.19 లక్షలకు పైగా దరఖాస్తులు ఉంటాయని రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి.

**మేడ్చల్ జిల్లాలోనే అత్యధికం..**

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో జీఓ 58 కింద 26,092 దరఖాస్తులు రాగా.. 15 మండలాల పరిధిలోని పురపాలికలు, గ్రామపంచాయతీల్లో 41 బృందాలు క్షేత్ర స్థాయిలో విచారణ నిర్వహించారు. జిల్లాలో జీఓ 59 కింద వచ్చిన 15,200 దరఖాస్తులను కూడా క్షేత్ర స్థాయిలో 41 బృందాలు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు.
- రాష్ట్రంలోనే మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో జీఓ 58,59 కింద అత్యధికంగా 41,292 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల విచారణలో భాగంగా ఇళ్ల పరిశీలన బృందాల్లో డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్ ఉండేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.
- ప్రతీ క్షేత్ర స్థాయి బృందం ఇంటి ఫొటో అప్‌లోడ్ చేయటంతో పాటు జీవో నిబంధనల ప్రకారం ఉన్నాయా..? లేదా అని చూసుకోవడం, సేకరించిన ఆధారాలను ప్రత్యేకంగా రూపొందించిన ' మొబైల్ యాప్'లో నమోదు చేసి, వాటిని కలెక్టర్ లాగిన్ సిఫార్సు చేయడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ దరఖాస్తులను వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మరోసారి పరిశీలించిన తర్వాత ఆమోదం.. లేదా తిరస్కరించే అవకాశం ఉంటుంది.